# రథసప్తమి ముందే

# మున్సిపల్ విస్ఫోటనం!





నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 77 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
11-01-2026 ఆదివారం వెల : 1/- పేజీలు : 4


- కమిషనర్‌ను సంచాలకుల వద్దకు పంపిన ప్రభుత్వం- వెనుక దాగిన 'బిల్లుల రాజకీయం' ఏంటి?
- రథసప్తమి పండుగకు ముందే శ్రీకాకుళం మున్సిపల్ శాఖలో అనూహ్య పరిణామాలు
- పివివిడీ ప్రసాదరావును సంచాలకుల వద్దకు రిపోర్ట్ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు
- ఒక వర్గానికి బిల్లులూ మరో వర్గానికి మొండిచేయి? ఆరోపణల ముసురులో కమిషనర్
- ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డీఈ కమలాకర్ - త్వరలో హనుమంతు కూర్మారావు ఎంట్రీ?
- ఫిర్యాదుల వెనుక రాజకీయ ఒత్తిళ్లా? లేక పాలనా వైఫల్యాలే కారణమా?



**(నవతరం ప్రతినిధి - శ్రీకాకుళం):**

రథసప్తమి పండుగకు ముందు శ్రీకాకుళం మున్సిపల్ పరిపాలనలో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు అధికార వర్గాల్లోనే కాదు, ఉద్యోగులు, కాంట్రాక్టర్ల మధ్య కూడా తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. మున్సిపల్ కమిషనర్ పివివిడీ ప్రసాదరావును ఆకస్మికంగా మున్సిపల్ శాఖ సంచాలకుల వద్దకు రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడం వెనుక అసలు కారణాలేంటి అన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.
స్వామి భక్తుడిగా పేరు తెచ్చుకున్న ప్రసాదరావు హయాంలో మున్సిపల్ వ్యవహారాలు ఒకే వర్గానికి అనుకూలంగా సాగాయన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఒక వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు ప్రొసీజర్ పాటించకపోయినా బిల్లులు చెల్లించారన్న విమర్శలు ఉండగా, మరో వర్గానికి మాత్రం మొండిచేయి చూపారన్న ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రజాప్రతినిధి చెప్పారన్న పేరుతో బిల్లులు మంజూరు చేయడంలో ప్రసాదరావు తనకుతానే ప్రత్యేక శైలిని అవలంబించారన్న వాదన కూడా వినిపిస్తోంది. గత రథసప్తమి పండుగ సమయంలోనూ ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరికే బిల్లులు చెల్లించి, ఒక వర్గానికి చెందిన కాంట్రాక్టర్లకు అడ్డుఅదుపు లేకుండా పనులు అప్పగించడం, నిబంధనలను పక్కనపెట్టడం వంటి అంశాలు అప్పట్లోనే వివాదాస్పదంగా మారాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిపాలన ఇంత అస్తవ్యస్తంగా మారడానికి స్వామి భక్తి ముసుగులో సాగిన వ్యవహారాలే కారణమా? అన్న కోణంలో ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉండగా, అధికార పార్టీకి చెందిన కొందరు నేతల ఒత్తిళ్ల కారణంగానే ప్రసాదరావు 'ఇక్కడి నుంచి వెళ్లిపోతా' అని గత కొన్ని నెలలుగా చెప్పుకుంటూ వచ్చారన్న వాదన మరోవైపు వినిపిస్తోంది. పండుగ వేళ ఇలా ఆకస్మికంగా ప్రభుత్వ ఆదేశాలు రావడం వెనుక ఏదైనా మర్మం దాగి ఉందా? అంతుచిక్కని రహస్యాలు ఉన్నాయా? అన్న అనుమానాలు బలపడుతున్నాయి.
ఈ పరిణామాల నేపథ్యంలో ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డీఈ కమలాకర్ బాధ్యతలు చేపట్టగా, త్వరలోనే హనుమంతు కూర్మారావు శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్‌గా రానున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది. మరోవైపు ప్రసాదరావుపై కొందరు కాంట్రాక్టర్లు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఒక ప్రజాప్రతినిధి చెప్పిన వారికే బిల్లులు ఇవ్వడం, మిగతా వారిని పక్కన పెట్టడం వంటి ఆరోపణలతో పాటు మరెన్నో అంశాలు ఫిర్యాదుల్లో ఉన్నట్లు తెలుస్తోంది.
ఏది ఏమైనప్పటికీ, స్వామి భక్తుడిగా పేరున్న అధికారిపైనే ఇలాంటి చర్యలు తీసుకుంటే, మిగతా ఉద్యోగులు, రాబోయే అధికారులు తప్పక ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన 'తెలియని శక్తులు' వెనుక నుంచి నడిపిస్తున్నాయా? లేక నిజంగా పాలనా వైఫల్యాలకే ఇది ఫలితమా? అన్న ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది.
ఇక ఫిర్యాదు చేసిన కాంట్రాక్టర్లకు సంక్రాంతిలోగా బిల్లులు చెల్లించి, కూటమి ప్రభుత్వం నిజంగా 'మంచి ప్రభుత్వం' అని నిరూపించుకుంటుందో లేదో చూడాల్సిందేనన్న చర్చ శ్రీకాకుళంలో హాట్‌టాపిక్‌గా మారింది..

## కొత్త చట్టంతో మేలు కన్నా అన్యాయమే ఎక్కువ

### జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సలపల అన్నాజీ రావు



**(నవతరం- శ్రీకాకుళం):**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పేరు మారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సలపల అన్నాజీ రావు , జిల్లా ఇన్చార్జ్ గాదం వెంకట త్రినాధరావు లు డిమాండ్ చేశారుఈ మేరకు శనివారం స్థానిక ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రెల్ల సురేష్ తో కలిసి వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మారుస్తూ కొత్త చట్టాన్ని వీబీ జీ రామ్ జీ చేయడం వలన గ్రామీణ పేద ప్రజానీకానికి లబ్ధి చేకూరుతుందని బిజెపి ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం అన్నారు.
ఈ కొత్త చట్టం తో మేలు కన్నా అన్యాయమే జరుగుతొందని చెప్పారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఉపాధి హామీ పథకం జరుగుతున్న ప్రాంతాల్లో ఉపాది కూలిలతో సమావేశం నిర్వహించిన అవగాహన కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే మాజీ సలహాదారు మండల సభ్యులు మంత్రి నరసింహమూర్తి, ఆముదాలవలస నియోజకవర్గం కోఆర్డినేటర్ బొచ్చువెంకటరమణ, నరసన్నపేట నియోజకవర్గ కోఆర్డినేటర్ మామిడి సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు దేశెల్ల గోవింద మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు



## వయోవృద్ధులకు న్యాయ భరోసా

### వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

**నవతరం -శ్రీకాకుళం**

వయసు మళ్లిన కాలంలో వృద్ధులు ఆత్మగౌరవంతో, రక్షణతో బతికేలా చూడటమే న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు పేర్కొన్నారు. శనివారం ఆయన నగరంలోని 'ప్రశాంతి వృద్ధ జనాశ్రమాన్ని' సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులతో హరిబాబు నేరుగా ముచ్చటించారు. వయోవృద్ధులకు న్యాయ సేవలు స్కీం – 2016 గురించి వారికి వివరించారు. చట్టం కల్పించిన సౌకర్యాలను ఎలా ఉపయోగించుకోవాలో సూచించారు. ఆశ్రమంలో వారికి అందుతున్న -మిగతా 3లో

## రాజగోపాలరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన మాజీ స్పీకర్



**నవతరం -టెక్కలి**

హరిచంద్రపురం కూడలిలో ఉన్న డాక్టర్ రాజగోపాల్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మాజీ స్పీకర్ పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాం స్థానిక సర్పంచ్ గురుగుబెల్లి కేశవరావు మరియు ఎంపీటీసీ లు బగాది దివాకర్ పూజారి సత్యం ఆధ్వర్యంలో రాజగోపాల్ రావు విగ్రహానికి పూలమాల లేసి ఘనంగా నివాళులర్పించారు ముందుగా తమ్మినేని సీతారాం కి ఘనంగా స్వాగతం పలికారు స్థానిక నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో తమ్మినేని కి పూలమాలలు వేసి దుస్సాలువాతో సత్కరించారు.
ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల జడ్పిటిసి సనపల నారాయణరావు పొందూరు మండల వైయస్సార్ పార్టీ మాజీ అధ్యక్షులు పప్పుల రమేష్ కాళింగ కమ్యూనిటీ నాయకులు సూర్యం అదేవిధంగా స్థానిక నాయకులు బిల్లంగి నారాయణరావు, సీపాన రామారావు కూన డిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# లొంగు 'బాట'లో ఐరోపా!

ప్రజాస్వామ్యం, గణతంత్రం, మానవహక్కులు, స్వేచ్ఛ వంటి నేతిబీర కబుర్లు చెబుతున్న నేతలకు ఇప్పుడు డోనాల్డ్‌ట్రంప్ రూపంలో అగ్నిపరీక్ష ఎదురైంది. వెనెజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను కిడ్నాప్ చేసిన తీరుచూసి అగ్రరాజ్యం ఇలా కూడా చేస్తుందా? అని సామాన్యులు నమ్మలేకపోతున్నారు. గతంలో హిట్లర్ ప్రపంచ దురాక్రమణకు పాల్పడినతీరు, పర్యవసానాలను యావత్ ప్రపంచం చవిచూసింది. ఇప్పుడు ఏదో ఒకసాకుతో అమెరికా తనకు కావాల్సిన ప్రాంతాలను స్వచ్ఛందంగా అప్పగించాలి లేదా బలప్రయోగం చేయాల్సి వస్తుందని చెబుతోంది. ఇది ఏ పరిణామాలు, పర్యవసానాలకు దారితీస్తుందో తెలియదు. మదురో తదుపరి లక్ష్యం డెన్మార్క్‌లో అంతర్భాగం, స్వయం పాలిత ప్రాంతమైన గ్రీన్‌లాండ్ స్వాధీనం అని ప్రకటించారు. తన భద్రత అవసరాలకు సహజ సంపదలతో జర్మనీ కి మూడు రెట్లు పెద్దదైన ఆ మంచుదీవి కావాలని చెబుతున్నాడు. 'తోటకూరనాడే నిరోధించి ఉంటే తమ బిడ్డ ఇలా ముదిరేవాడు కాదన్న' లోకోక్తి మనకే కాదు యావత్ ప్రపంచానికి తెలిసిందే.

రెండోసారి అధికారం చేపట్టిన కొద్దిరోజులకే గతేడాది జనవరిలోనే గ్రీన్‌లాండ్ కావాలన్న వాంఛను ట్రంప్ ప్రకటించాడు. అప్పుడే ఇతర నాటోదేశాలు, ముఖ్యంగా ఐరోపా పెద్దలుగా ఉన్న జర్మనీ, ఫ్రాన్సు, బ్రిటన్ గట్టిగా హెచ్చరించి అడ్డుకొని ఉంటే ఇంతదాకా వచ్చేది కాదు. ఇప్పుడు ఆ ప్రాంతాన్ని కబ్జా చేసుకొనేందుకు సిద్ధపడటాన్ని చూసి గొణగటం తప్ప వారికి నోటమాట రావటం లేదు. 'గ్రీన్‌లాండ్ నాటోలో భాగం, ఆర్కిటిక్ ప్రాంతంలో భద్రత ఉమ్మడిగా సాధించాలి, అమెరికాతో సహా అందరికీ బాధ్యత ఉందని' అంటూనే డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌కు సంబంధించిన అంశాలపై నిర్ణయించుకోవాల్సింది కూడా వారే అంటూ ఐరోపా యూనియన్ చెప్పటం అమెరికాకు దాసోహం తప్ప మరొకటి కాదు. పెద్దన్న కావాలంటున్నాడు ఇవ్వాలో లేదో మీరు మీరు తేల్చుకోండని చేతులెత్తేసినట్లే. గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటే నాటో విచ్ఛిన్నమైనట్లే అని డెన్మార్క్ తన పౌరులను సంతుష్టీకరించేందుకు ఒక ప్రకటన చేసినప్పటికీ సదరు పెద్ద దేశాల వైఖరి ఎలా ఉంటుందో దాని కి ముందే తెలుసు. అందుకే కావాలంటే గ్రీన్‌లాండ్‌లో ఇప్పటికే ఉన్న అమెరికా మిలిటరీ స్థావరాన్ని మరింత పటిష్ట పరుచుకొనేందుకు తమకు అభ్యంతరంలేదని, తాము కూడా అక్కడ నాలుగు వందల కోట్ల డాలర్లతో నౌకలు, డ్రోన్లు, విమానాలను మోహరి స్తామని ఇటీవలనే డెన్మార్క్ ప్రకటించిన అంశాన్ని మరచిపోరాదు. కొరకరాని కొయ్యగా ఉన్న రష్యాను మచ్చిక చేసుకొని చైనాతో ఉన్న బంధాన్ని తెంచేందుకు అమెరికా ఎప్పటి నుంచో బిస్కెట్లు వేస్తున్నది. కావాలంటే ఉక్రెయిన్‌లో ఎంత ప్రాంతం కావాలంటే అంత తీసుకోవచ్చని చెప్పటం దానిలో భాగమే. గతంలో ఒకసారి జి8 కూటమిలో చేర్చుకొని తర్వాత బయటకు గెంటేసిన అనుభవం ఉంది. ట్రంప్– పుతిన్ ఇద్దరూ ఇసుక తక్కెడ పేడ తక్కెడ రకాలు గనుక అంత తేలికగా అమెరికాను నమ్మటం లేదు. ఉక్రెయిన్‌లో రష్యాను అడ్డుకొనే స్థితి కనుచూపుమేరలో కనిపించటం లేదు, ఇప్పుడు గ్రీన్‌లాండ్‌ను అమెరికా ఆక్రమిస్తే మీరేం చేస్తున్నారని యూరోపియన్లు తమ దేశాల నేతలను ప్రశ్నించటం సహజం. అమెరికాను ఎదిరించలేరు, ఆధిపత్యాన్ని ఆమోదించనూ లేరు అన్నట్లుగా ఐరోపా పెద్దల పరిస్థితి ఉందంటే అతిశయోక్తి కాదు.

ప్రపంచాన్ని పంచుకొనేందుకు ఐరోపా దేశాలే దెబ్బలాడుకున్నాయి, అమెరికా ఆలస్యంగా రంగంలోకి వచ్చింది. లాటిన్ అమెరికా దేశాలు ఐరోపా ముఖ్యంగా స్పెయిన్, బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందిన తరువాత తిరిగి అవి వాటి మీద పెత్తనం చేయకుండా తన ఆధీనంలోకి తెచ్చుకొనేందుకు ఆ దేశాల్లో మరోసారి ఐరోపా జోక్యం చేసుకోకూడదంటూ దుష్టాలోచనతో ముందుకు తెచ్చిందే అమెరికా మన్రో సిద్ధాంతం. దానికనుగుణంగానే తరువాత కాలంలో తన పెరటితోటగా మార్చుకుంది.

అక్కడ వామపక్ష శక్తుల ప్రభావం పెరుగుతుండటంతో తిరిగి తన పట్టునిలుపు కొనేందుకు అమెరికా ఆటవిక న్యాయానికి దిగింది. దాన్నే డోన్రో (డోనాల్డ్ ట్రంప్–మన్రో) సిద్ధాంతం అంటున్నారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఐరోపాను నాటో పేరుతో తన కట్టడిలోకి అమెరికా తెచ్చుకుంది. పాము తనపిల్లలను తానే తింటుందన్నట్లుగా నాటో రక్షణలో ఉన్న గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకొనేందుకు అమెరికా స్వయంగా పూనుకుంది. ఐరోపాలో ఉన్న సామ్రాజ్యవాద శక్తులు అమెరికాను ఒంటరిగా ఎదిరించలేకనే ఐరోపా సమాఖ్యను ముందుకు తీసుకు వచ్చాయి, ఇటీవలి కాలంలో మిత్రవైరుధ్యం తలెత్తింది. దాన్లో భాగంగా అదే ఐరోపా దేశాల మీద పన్ను విధిస్తానంటే అవి మూసుకొని కూర్చున్నాయి. అయితే ఎల్లకాలం ఇదే విధంగా ఉంటాయని అనుకోరాదు. తమ మౌలిక ప్రయోజనాలకు దెబ్బతగలనంత వరకు రాజీపడతాయి. తర్వాత లడాయికి దిగుతాయి. అది ఎప్పుడు, ఎలా అన్నది ఎవరూ చెప్పలేరు!

# బిసిఎ చేసిన వారికి ఉన్నత భవిష్యత్తు



- సీనియర్ సెక్యూరిటీ అనలిస్ట్
- కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో బిసిఎ ఇంటర్నల్ ఫెస్ట్

(నవతరం, శ్రీకాకుళం)

స్థానిక ఎనభై అడుగుల కూడలి వద్దనున్న కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కాళాశాలలో బిసిఎ ఇంటర్నల్ ఫెస్ట్ (అక్ష టూకె – 2026) లో భాగంగా నిర్వహించిన వేడుకలలో ముఖ్యఅతిధిగా సీనియర్ సెక్యూరిటీ అనలిస్ట్ బలివాడ.అరుణ్ కుమార్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం అన్ని రంగాలలో కంప్యూటర్ అనేది భాగస్వామ్యం అయ్యిందని, బిసిఏ వంటి ప్రొఫెషనల్ కోర్సెస్ చేసిన వారికి మంచి అవకాశలు ఉన్నాయని, కంప్యూటర్ సైన్స్ తో వేల ఉద్యోగాలు ఈ రోజు పొందగలుగుతున్నామన్నారు. అనంతరం డైరెక్టర్ బిఎస్. చక్రవర్తి, ప్రిన్సిపాల్ శివశంకర్ మాట్లాడుతూ ఈ రోజు సాంకేతిక పరిజ్ఞానం అత్యంత వేగంగా అభివృద్ధి చెందడానికి గల కారణం కంప్యూటర్ అని, మారుతున్న టెక్నాలజీలను కూడా నేర్చుకోవాలన్నారు. వేడుకలలో భాగంగా విద్యార్థుల కోసం నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విజేతలకు ముఖ్యఅతిధి చేతుల మీదుగా బహుమతులను అందజేసి, కళాశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె. వేణు, కంప్యూటర్ విభాగాధిపతి ఎల్. ప్రసాద రావు, కంప్యూటర్ విభాగ అధ్యాపకులు, బిసిఏ విద్యార్థినిలు పాల్గొన్నారు.

# యువతే దేశానికి శక్తి

## 12న జాతీయ యువజన దినోత్సవం



దేశానికి యువతను వెన్నెముకగా , జాతికి వారు తరగని ఆస్తిగా చెబుతుంటారు. యువత తమలోని అపర శక్తి యుక్తులను వెలికి తీసి, కాలానికి తగిన నైపుణ్యాలను పుణికి పుచ్చుకుంటే ఉన్నత శిఖరాలను చేరుకోవడం సుసాధ్యం అవుతుంది. అలాంటి విలువైన మానవ వనరులు దేశాన్ని ప్రగతి పథంలో పరుగులు తీయిస్తాయి. శరవేగంతో మారుతున్న ప్రపంచ పోకడల నేపథ్యంలో జాతి నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలి.

యువతి యువకులను మేలైన మానవ వనరులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్న సంకల్ప స్ఫూర్తితో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ప్రతి ఏటా జనవరి 12 న జాతీయ యువజన దినోత్సవం గా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. దేశ నిర్మాణానికి మూల స్తంభం లాంటి యువతరంలో స్ఫూర్తి నింపడానికి స్వామి వివేకానంద అనేక ఉత్తేజకర ప్రసంగాలు చేశారు. 'లేదు,కాదు అని ఎన్నటికీ అనకండి. మీలో అనంతమైన శక్తి ఉంది. మీరు సాధించలేని దంటూ ఏదీ లేదు' అని యువతను దిశా దశ నిర్దేశించారు. ఏ దేశం పురోగతి సాధించాలన్నా యువతను విజ్ఞానవంతులుగా, నిపుణులుగా తీర్చిదిద్దుకోవాలి.

భారతదేశ యువతలో స్వామి వివేకానంద వాక్కులు ఎన్నటికీ స్ఫూర్తి నింపుతూనే ఉంటాయి.' మీరు బలహీనులమని భావిస్తే బలహీను లే అవుతారు. బలీయ శక్తులమని భావిస్తే బలీయ శక్తులుగానే ఎదుగుతారు. నిరంతర కృషితో ఉన్నత శిఖరాలకు ఎదగండి' అంటూ ఆయన ఉద్భోదించారు. ఆధునిక ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్లను అధికమించి జీవితంలో ముందడుగు వేసేలా యువతరాన్ని చైతన్య పరచడమే యువజన దినోత్సవ లక్ష్యం.

మానసిక ఒత్తిళ్లు..

ఐక్యరాజ్యసమితి ప్రకటించిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 కల్లా సాధించడానికి యువత పాత్రే కీలకం. ప్రపంచంలో యువ జనాభా అధికంగా ఉన్నది భారత్ లోనే. 2030 నాటికి మనదేశంలో 36.5 కోట్ల మంది 15–29 ఏళ్ల వయో వర్గంలో ఉంటారని అంచనా. ఈ నేపథ్యంలో సరైన చదువు,నైపుణ్యాలు,ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేకపోవడం వల్ల దాదాపు సగం మంది యువతి యువకులు అనేక రకాల మానసిక ఒత్తిళ్లకు లోనవు తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్ ఉంటుంది. ఇటీవల కాలంలో అంతర్జాలం వినియోగం భారీగా పెరిగింది. ఇంటర్నెట్ ను వినియోగిస్తున్న యువత మానసిక స్థితిపై సిపియన్స్ ల్యాబ్ సంస్థ ఒక అధ్యయనం జరిపింది. దాని ప్రకారం నిరుడు దేశీయంగా 51 శాతం మంది యువత మానసిక ఒత్తిళ్లకు గురైనట్లు పేర్కొంటుంది. ఈ మనో వ్యధ నుంచి యువతను బయటకు తేవాలి. యువజనుల ఆరోగ్యంతో పాటు నివాసం, ఆహారం, విద్య, పారిశుద్ధ్యం, పర్యావరణం, కుటుంబం, సమాజం పైన దృష్టి కేంద్రీకరించి వచ్చిన బాధ్యత పాలకవర్గాలపై ఉంది. యువతకు కళల తోపాటు రాజకీయాల్లోనూ ఉన్నత స్థానాలను అందుకునేలా మార్గదర్శనం చేయాల్సి ఉంది. నాయకత్వం అంటే ఏమిటో, వ్యక్తిగతంగా, సమాజ పరంగా దాని అవసరం ఎంత ఉందో యువతకు తెలియ చెప్పడం తక్షణావసరశీ.

యువతను ఉద్యోగార్ధులుగా కాకుండా ఉద్యోగాలు ఇచ్చే వారిగా తీర్చిదిద్దడం విద్యా సంస్థ కర్తవ్యం. అది జరిగినప్పుడు మన యువత విదేశాలకు వలస వెళ్లవలసిన అగత్యం తప్పుతోంది. తల్లిదండ్రులు సైతం పిల్లలకు జాతి పట్ల తమ విధులు, బాధ్యతల గురించి బోధించాలి. నైతిక విలువలు నేర్పాలి. విజ్ఞాన నైపుణ్యాలను అలవర్చుకొని, జీవితంలో స్వశక్తితో రాణించేలా ప్రోత్సహించాలి. నవ సాంకేతిక యుగంలో విజయం సాధించాలన్న దీక్ష దక్షతులు, దృఢ సంకల్పం, అంకిత భావాలను యువతీ యువకులు పుణికి పుచ్చుకోవాలి. వారు పైకి ఎదగడానికి కావలసిన వాతావరణాన్ని ప్రభుత్వం, సమాజం సృష్టించాలి.

డాక్టర్ ఎ. వి. రామకృష్ణ
సావిత్రి నర్సింగ్ హెూమ్,
సోంపేట ( శ్రీకాకుళం జిల్లా)

# బ్రెయిలీ జయంతి సందర్భంగా లయన్ నాయుడుకు సత్కారం

(నవతరం, శ్రీకాకుళం)



లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలో శనివారం జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో జిల్లా వికలాంగుల సంక్షమ విభాగం (ఇందిరాక్రాంతి పథం) విశ్రాంత ప్రాజెక్టు మేనేజర్, విశ్రాంత జిల్లా సదరం ఇన్చార్జి వి.జగన్నాథనాయుడును రాష్ట్ర స్థాయి అంధత్వ నివారణ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

# విశాఖలో 29 నుంచి ఉప లోకాయుక్త 'క్యాంప్ సిట్టింగ్'

(నవతరం, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర జిల్లాల ప్రజలకు లోకాయుక్త సేవలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని ఈనెల 29, 30 తేదీల్లో విశాఖపట్నంలో 'క్యాంప్ సిట్టింగ్' నిర్వహించనున్నారు. మహారాణిపేటలోని జిల్లా పరిషత్ కార్యాలయం వేదికగా రెండు రోజుల పాటు ఈ విచారణ కొనసాగనుంది. ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకతను పెంచడం, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లోకాయుక్త రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో సూచించారు.

ఈ సిట్టింగ్‌లో భాగంగా లోకాయుక్తలో ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై విచారణ జరపడంతో పాటు, ప్రజల నుంచి కొత్త అర్జీలను కూడా స్వీకరిస్తారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల అవినీతి, విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం, పరిపాలనాపరమైన లోపాలపై బాధితులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదుల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న ఈ సేవలను ఆయా జిల్లాల ప్రజలు వినియోగించుకోవాలని రిజిస్ట్రార్ కోరారు.

# తక్షణమే కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

## సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు

నవతరం టెక్కలి



సంక్రాంతి ముందు అప్పులతో, పస్తులతో కార్మిక కుటుంబాలు గడుపుతున్నారని తక్షణం సి.పి.డబ్లు.యస్ కార్మికులు కు బకాయి జీతాలు చెల్లించాలని సిఐటియు నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. టెక్కలి లో శ్రీ కింజరాపు ఎర్రన్నాయుడు సమగ్ర రక్షిత మంచినీటి సరపరా పథకం లో 2016 నుండి కంటిన్యూగా పది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు 15000/ రూపాయలు చెప్పున్న జీతాలు చెల్లించేవారని, క్రొత్త కాంట్రాక్టరు వచ్చి ఏడు నెలలు కావస్తున్నా జీతాలు పెంచమని కోరినప్పటికీ జీత బత్యాలు నిర్ణయించలేదని అన్నారు. అడ్వాన్స్ పేమెంట్ అంటూ రెండు సార్లు కొద్ది మొత్తాల్లో చెల్లించారు. నాలుగు నెలల నుండి అడ్వాన్స్ లు కూడా నిలుపుదల చేసారు. కార్మికులు కు పి.ఎఫ్ లు కట్టాలని నిర్ణయించి నప్పటికి చెల్లించు టలేదని అన్నారు.ఆర్.డబ్లు.యస్ ఎ.ఇ,డిఇ లు , అధికారులు పనిచెప్పడమే తప్ప మాజీత బత్యాలు సమస్యలు పట్టించుకోవడం లేదు అన్నారు. తక్షణం జీతాలు పెంచి బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సురేష్, ఉమేష్, అనిల్, రమేష్, ధర్మారావు, రత్నాకర్, పాపారావు, శ్రీను ధనుంజయ,సంతోసుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయంగా సంక్రాంతి



యం.రాం ప్రదీప్

తెలుగు వారు జరుపుకునే పండుగలలో సంక్రాంతి పెద్ద పండుగ.ఇది ఒక మతానికి చెందిన పండుగ కాదు.సంక్రాంతి అనేది రైతుల పండుగ.ఈ పండుగనే తమిళనాడులో పొంగల్ అని పిలుస్తారు. ముగ్గులని అందంగా సంక్రాంతి సందర్భంగా వేస్తారు. తెలుగు రాష్ట్రాలలో పలు ప్రజా సంఘాలు స్త్రీలకు ముగ్గులు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తారు. భోగి రోజు చిన్న పిల్లలకు భోగి పండ్లు పోస్తారు.పశు వులని శుభ్ర పరుస్తారు.అరెసలు సంక్రాంతి వంటకంగా ప్రత్యేకత పొందింది. ప్రజలు పర్యావరణహితంగా ఈ పండుగను జరుపుకుంటారు. హరి దాసుల సందడి కూడా కన్పిస్తుంది. అయితే రాను రాను తెలుగు. రాష్ట్రాల్లో సంప్రదాయం పేరుతో కోడి పందాలని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. డబ్బులు కూడా పెద్ద ఎత్తున చేతులు మారుతుంటాయి. రాజకీయ నాయకులు స్వయంగా ఈ పోటీల్లో పాల్గొనడంతో ఈ పందాలకి మరింత ఆదరణ లభిస్తోంది. కోడి పందాల చాటున పేకాట వంటివి కూడా కొందరు గ్రామాల్లో ఆడుతున్నారు.ప్రస్తుతం హరిదాసుల సందడి పెద్దగా కనిపించడం లేదు. కోర్టులు సైతం కోడి పందాలు నిర్వహించవద్దని ఆదేశాలు ఇస్తున్నాయి. నిర్వాహకులు ఈ ఆదేశాలని పెద్దగా పట్టించుకోవడంలేదు.పందాల్లో పలువురు భారీ మొత్తంలో డబ్బు కోల్పోయి రోడ్డున పడుతున్నారు. అయితే అన్ని సమస్యలని కోర్ధులు పరిష్కరించలేవు. పండుగ జరుపుకోవడం ఎవరికైనా ఆనందమే. పదిమంది కలవడానికి పండుగలు ఒక వేదికగా ఉపయోగపడతాయి. ప్రభుత్వాలు ప్రజలకు పండుగ వేళల్లో వినోదం, విజ్ఞానం పొందడానికి ప్రత్నామ్నాయ ఏర్పాట్లు చేయాలి.ముగ్గుల పోటీలు ప్రభుత్వమే నిర్వహించాలి. యువతకు క్రికెట్, కబడ్డీ వంటి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వాలి. విదేశాల్లో స్థిరపడ్డ పలువురు వివిధ సందర్భాలలో గ్రామాలకు వస్తుంటారు.అటువంటి వారిని గుర్తించి ఆయా గ్రామాలకి కావలసిన మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేయాలని వారిని కోరవచ్చు. ఏ పండుగనైనా నిర్మలంగా, ప్రశాంతంగా జరుపుకోవడం మంచిది.అదే విధంగా వివిధ ప్రాంతాల్లో ఉండే మంచి ఆచారాల ను కాపాడు కోవాలి. అది మన బాధ్యత కూడా.

# వయోవృద్ధులకు న్యాయ భరోసా

మొదటిపేజీ తరువాయి

ఆహారం, వైద్య సదుపాయాలు, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. న్యాయపరమైన సహాయం కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నెంబర్ 15100 గురించి ఆయన వివరించారు. ఈ నెంబర్ వృద్ధులందరికీ కనిపించేలా ఆశ్రమ నోటీసు బోర్డుపై అతికించాలని నిర్వాహకులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత న్యాయ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ప్రశాంతి వృద్ధాశ్రమం నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిదండ్రులు, వయోవృద్ధులకు సరైన పోషణ, సంరక్షణ కల్పించాలి

## సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి బి. నిర్మల

**నవతరం టెక్కలి**



నేడు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, శ్రీకాకుళం వారి ఆదేశాలు మేరకు శనివారం కోర్టుల సముదాయం, టెక్కలి లో వయోవృద్ధులతో తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్స్ నిర్వహణ మరియు సంక్షేమ చట్టం, 2007 పై టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి మరియు ఛైర్పర్సన్, మండల న్యాయ సేవాధికార సంస్థ వారైన బి. నిర్మల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ పిల్లలు లేదా బంధువులు తమ తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్స్ కు జీవనానికి అవసరమైన వసతులు కల్పించాలని, అలాగే వారి ఆరోగ్య సంరక్షణ , నివాసం, ఇతర అవసరాలను తీర్చాలని, వారిని నిర్లక్ష్యం చేయకూడదని, నిర్లక్ష్యం చేసేవారిపై చట్టపరమైన చర్యలు మరియు జైలు శిక్షలు విధించబడతాయని ఆమె సూచించారు. ఈ సదస్సులో టెక్కలి న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ పట్నాయక్,సీనియర్ సిటిజన్స్, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బాలిగాంలో క్విజ్ పోటీలు

**నవతరం-మందస**

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా మందస మండలం బాలిగాం గ్రామంలో హై స్కూల్ స్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి సుమారు 70 టీములు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాయి.పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌హరిపురం విద్యార్థులు ప్రతిభ చూపుతూ మొదటి బహుమతి మరియు మూడో బహుమతిని కైవసం చేసుకోగా, హరిపురం గీతం పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. విజేతలకు గున్న గంగాధర్ రావు, గున్న రామారావు, బావన సతీష్ బహుమతులు అందజేశారు.
ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మందస సబ్ ఇన్స్పెక్టర్ కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామి వివేకానంద ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు.
వేకానందుడు జాతికి అండగా నిలిచిన ధ్రువతార అని ఆయన కొనియాడారు.ఈ కార్యక్రమంలో



గ్రామ పెద్దలు, గ్రామ ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# విజయ్ ఆఖరి సినిమా అని ఎవరు చెప్పారు!

నేలకొండ భగవంత్ కేసరి రీమేక్ గా తెరకెక్కి, విడుదలకు సిద్ధం అవుతున్న జననాయగన్ సినిమా తమిళ సూపర్ స్టార్ విజయ్ ఆఖరి సినిమా అనే ప్రచారం ఉంది. ఈ విషయాన్ని ఎవరో చెప్పనక్కర్లేదు, స్వయంగా విజయ్ ప్రకటించినట్టే ఉన్నాడు! ఇప్పటికే రాజకీయ పార్టీని ప్రారంభించి, మీటింగులు, రోడ్ షోలతో హల్చల్ చేస్తున్న విజయ్ ఒక సినిమా కెరీర్ కు ఫుల్ స్టాప్ పెట్టి ప్రజాసేవ చేసేసుకోవాలనుకుంటున్నారు. అందుకే ముఖ్యమంత్రి సీటు మీద కర్చీప్ వేసి, తన ప్రయత్నం తను చేస్తూ ఉన్నాడు!అయితే అదంత తేలిక కాదనే విషయం అందరికీ తెలిసిందే. సినిమా హీరోల అలా పార్టీ పెట్టి, ఇలా రాగానే ముఖ్యమంత్రి సీటు మీద కూర్చోబెట్టే రోజులు కావు ఇవి అని అందరి స్టార్ హీరోలకూ అర్థ మైంది. విజయ్ కాంత్, చిరంజీవి, పవన్ కల్యాణ్, కమల్ హాసన్, ఉపేంద్ర.. వీళ్లంతా పార్టీలు పెట్టి, తమను తాము సీఎం అభ్యర్థులుగా ప్రొజెక్ట్ చేసుకున్న వాళ్లే! విశేషం ఏమిటంటే.. వీరిలో విజయ్ కాంత్, చిరంజీవి, పవన్ కల్యాణ్ రాజకీయ ఎంట్రీ ముందు సినిమాల ముందు పురుటి వైరాగ్యం ప్రకటించిన వారే!ఇక తను సినిమాలే చేయానంటూ చిరంజీవి ప్రజారాజ్యం ముందు ప్రకటించారు! ఆ తర్వాత ఏమైందో వేరే చెప్పనక్కర్లేదు! ఇక పవన్ కల్యాణ్ సరేసరి! అసలు తనకు ప్రజలే ముఖ్యమని, సినిమాలు ఒక లెక్కాపక్కా కాదని అనేక సార్లు చెప్పారు! ఆ తర్వాతేమో మంచి డైరెక్షన్ టీమ్ ఉండి ఉంటే తను రాజకీయాల్లోకే వచ్చే వాన్ని కాదనీ ప్రకటించారు! ఇలా పవన్ ఎలాగైనా నాలుక మడతేస్తూ ఉంటారు! ఇప్పుడు పొత్తులో ఆయనకు డిప్యూటీ సీఎం పదవి దక్కినా సినిమాలు అయితే ఆపడం లేదు!ఇక కమల్ కూడా సినిమాలకు సెలవన్నట్టుగా కాస్త కలరింగ్ ఇచ్చారు పొలిటికల్ పార్టీ పెట్టే సమయంలో! కానీ.. ఆ పార్టీకే త్వరగా మంగళం పాడేసి, రాజ్యసభ సభ్యుడైపోయి, ఎంచక్కా సినిమాలు చేసుకుంటూ ఉన్నాడు. ఈ రాజకీయాలతో వేగడం తన బోటి వాడికే సాధ్యం కాదనే విషయం ఎన్నో సైకో ఎనలిటికల్ సినిమాలకు దర్శకత్వం వహించిన ఉపేంద్రకు కూడా అర్థమైపోయి, అటు దర్శకుడిగా, హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా యమ బిజీగా ఉన్నాడు!విజయ్ కాంత్ కూడా ఇదే బాటనే పయనించాడు, వీరందరికన్నా మునుపే! తన కెరీర్ మంచి స్థితిలో ఉన్నప్పుడే విజయ్ కాంత్ రాజకీయాల్లోకి వచ్చాడు, సీఎం సీటును టార్గెట్ అనుకున్నాడు. అయితే తను మాత్రమే ఎమ్మెల్యేగా నెగ్గగలిగాడు, ఎమ్మెల్యే హోదాలోనే సినిమాలు చేసుకుంటూ వచ్చాడు. ఆ ఐదేళ్లలో మూడు నాలుగు సినిమాలు చేశాడు.పొత్తు రాజకీయాలు చేశాడు. జయలలితతో పొత్తుతో వెళ్లి.. అచ్చం పవన్ కల్యాణ్ వలే చెప్పుకోదగిన సీట్లు సాధించాడు. ఆ సమయంలో డీఎంకే చిత్తవ్వడంతో శాసనసభలో విజయ్ కాంత్ ప్రతిపక్ష పాత్ర తీసుకున్నాడు. ఆ దశలో సినిమాలు ఆపేశాడు. కానీ ఆ తర్వాతి ఎన్నికల్లో డీఎంకే పుంజుకుంది. విజయ్ కాంత్ పార్టీ చిత్తయ్యింది. జయలలితే మరోసారి సీఎం అయినా.. విజయ్ కాంత్ పార్టీ సోలోగా పోటీ చేసి చిత్తయ్యింది. ఒకసారి ఎన్నికల్లో విజయ్ కాంత్ కు మూడో స్థానం దక్కింది. అయితే ఆయన ఆరోగ్యం కూడా క్రమంగా దెబ్బతింది. సినిమాల ఊసు లేకుండా పోయింది.ఇలా అందరూ అందరే! మరి రేపు విజయ్ సంగతి ఏమిటంటే.. ఏమీ లేదు! సీఎం కాలేకపోయినా, కనీస స్థాయిలో సీట్లు రాకపోయినా.. విజయ్ ఫీట్లు కూడా మిగతా స్టార్ హీరోలకు ఏమీ తీసిపోకపోవచ్చు! ఇండస్ట్రీ బంగారు బాతు, పదవి లేకపోతే రాజకీయ వేడిని తట్టుకోవడం స్టార్ హీరోల తరమూ కాదు!







# కథ తక్కువ.. కాలక్షేపం ఎక్కువ

పండగ సినిమా అంటే ఎలా వుండాలి. నవ్వులు పండిస్తూ సాగిపోవాలి. అంతకన్నా ఏమీ అక్కరలేదు. ఇలాంటి కాన్సెప్ట్ తో తయారవుతున్న సినిమా అనగనగా ఒకరాజు. సంక్రాంతికి వస్తున్న ఈ సినిమాకు హీరో నవీన్ పోలిశెట్టి. స్టాడింగ్ కమెడియన్ నుంచి హీరోగా ఎదిగాడు. స్టాడింగ్ కమెడియన్ కు పెద్దగా కంటెంట్ అవసరం లేదు. మాటలతో మ్యాజిక్ చేస్తారు. అనగనగా ఒక రాజు సినిమా కూడా ఇదే కాన్సెప్ట్ తో తయారైనట్లు కనిపిస్తోంది. ట్రయిలర్ లో పెద్దగా కొత్త కథేమీ కనిపించలేదు. గోదావరి జిల్లా డఅబశ్రీశ్రీబ్బు దర్పం వుండే రాజుగారు ..డబ్బున్న అమ్మాయిని పెళ్లి చేసుకోవాలనే ప్లాన్. అంతా బాగుంది అనుకుంటే ఎక్కడో బెడిసి కొట్టింది. ఆ తరువాత ఏమైంది. ఈ మధ్యలో అంతా డఅబశ్రీశ్రీబ్బులు.. దర్పాలు. వెటకారాలు.. పాటలు.. ఆటలు. కొత్త కథ కాదు. కానీ నవీన్ ను ఈ పాత్రలో చూడడం కొత్త. ఒక విధంగా చెప్పాలంటే జాతిరత్నాలు పాత్రను గోదావరి స్టయిల్ లోకి మారిస్తే గడుసుదనం రంగరించుకుని ఎలా వుంటుంది అన్నట్లు కనిపిస్తుంది. నవీన్ పోలిశెట్టికి మాత్రమే సెట్ అయ్యే స్టయిల్, మాటలు ట్రయిలర్ లో బాగానే పడ్డాయి. మీనాక్ష చౌదరి కూడా కాస్త తింగరి అనేట్లు కనిపించే పాత్ర పోషించింది. కానీ ఎక్కువగా ఆ యాంగిల్ ప్రొజెక్ట్ చేయలేదు. ట్రయిలర్ మొత్తం నవీన్ వన్ మ్యాన్ షో నే. ఇప్పటికే రెండు పాటలు బయటకు వచ్చాయి కనుక ఇక ట్రయిలర్ లో వాటి జోలికి వెళ్లలేదు.

# బాగాదికి ఘన సన్మానం



నవతరం-శ్రీకాకుళం

జాతీయ వినియోగ దారుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి అవార్డు డిసెంబర్ 24 తీసుకున్న సీనియర్ న్యాయవాది, జిల్లా వినియోగ దారుల సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షులు బగాది రామ్మోహన రావు శనివారం ఆయన ఛాంబర్ లో బీసీ అడ్వకేట్ అసోసియేషన్ ఘనంగా సన్మానం చేసారు. ఆయన సేవలు ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సన్మాన కార్యక్రమం లో బీసీ అడ్వకేట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర బీసీ సంక్షమ సంఘము అధ్యక్షులు ఆగురు ఉమామహేశ్యారావు, వాన కృష్ణ చందు, ఎన్ వి శేషగిరి రావు, కొమ్ము రమణ మూర్తి, అన్నెపు భువనేశ్వరారావు, మామిడి క్రాంతి, బి వి అప్పలనాయుడు, కూన అన్నం నాయుడు, బి వి రమణ, జీ మన్మధరావు.తదితరులు ఉన్నారు.

# సోమనాథ్ యాత్రకు శ్రీకాకుళంలో ఓంకార జపం

- బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఉమా జటలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు
- సనాతన ధర్మ వైభవానికి ప్రతీకగా హిందువుల ఐక్యతా సందేశం
- జనవరి 11న సోమనాథ్‌లో ప్రధాని మోదీ నేతృత్వంలో మహా యాత్ర
- పాల్గొన్న మహా రాణా ప్రతాప్ హైందవ సేవా సంఘ్ సభ్యులు

నవతరం-శ్రీకాకుళం

సోమనాథ్ ఆలయంలో గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ జీ చేపట్టనున్న లి'సహస్ర సంకల్ప యాత్ర'లికు మద్దతుగా శ్రీకాకుళం పట్టణంలో బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ పివిఎన్ మాధవ్ గారు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రొంగల గోపి శ్రీనివాస్ గారి ఆదేశాల మేరకు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-కన్వీనర్ శ్రీ పసుపులేటి సురేష్ బాబు సింగ్ గారి నేతృత్వంలో శ్రీకాకుళం పట్టణంలోని ఉమా జటలేశ్వర స్వామి ఆలయంలో 'ఓంకార జపం'తో పాటు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సురేష్ బాబు సింగ్ మాట్లాడుతూ, మన సనాతన ధర్మం వెయ్యేళ్ల చరిత్ర కలిగిన గొప్ప సంస్కృతి అని పేర్కొన్నారు. 1025 జనవరిలో గజనీ మహమ్మద్ దాడుల కారణంగా సోమనాథ్ ఆలయం ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, నేటికీ స్వాభిమానంతో, వైభవంతో నిలిచిందని అన్నారు. 2026 నాటికి ఆ సంఘటనకు 1000 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భం, అలాగే 1951లో పునర్నిర్మాణం జరిగి 75 సంవత్సరాలు పూర్తవుతున్న శుభసందర్భంలో దేశవ్యాప్తంగా విశ్వేశ్వర ఆలయాల్లో ఓంకార జపం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.
మే 11, 1951న అప్పటి రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ సమక్షంలో సోమనాథ్ ఆలయం భక్తులకు తిరిగి తెరచిన చారిత్రక ఘట్టాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.



వెయ్యేళ్ల ఆటుపోట్లు ఎదుర్కొన్నా, సోమనాథ్ ఆలయం ధర్మ పరిరక్షణకు ప్రతీకగా నిలిచిందన్నారు.
జనవరి 11న గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో సోమనాథ్ ఆలయంలో 'సహస్ర సంకల్ప యాత్ర' నిర్వహించబడుతుందని, సంవత్సరం పొడవునా జరుపుకునే లి'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ఒలిను అధికారికంగా ప్రకటించనున్నట్లు వెల్లడించారు.
ఈ కార్యక్రమంలో మహా రాణా ప్రతాప్ హైందవ సేవా సంఘ్ సభ్యులు ప్రసాద్ సింగ్, అరవింద్ సింగ్, సంతోష్ సింగ్, వెంకట్, రమణ, రమణి, లక్ష్మభాయి, శ్రావణీభాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో అప్రమత్తత అవసరం




(నవతరం, శ్రీకాకుళం)

గ్రామాల్లో ప్రజలు అప్రమత్తతతో వ్యవహరించాలని శ్రీకాకుళం పట్టణ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి.ఈశ్వరరావు పేర్కొన్నారు. శనివారం సీపన్నాయుడుపేట గ్రామంలో సామాజికవేత్త సీపాన రామారావు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, ప్రజలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సమయాల్లో ఇళ్ళు వదలి వెళ్లాల్సి వస్తే నగదు, ఆభరణాలు వంటి విలువైన సామగ్రి వెంటతీసుకుని వెళ్లాలన్నారు. అలాంటి పరిస్థితుల్లో తగిన సమాచారం తమకు అందించాలని సూచించారు. తద్వారా నిఘా ఉంచి, ఇంటికి తమవంతు రక్షణ చేకూరుస్తామన్నారు.
అదేవిధంగా యువత, మహిళలు చెడువ్యసనాలు, మొబైల్ అక్రమ వినియోగం, అంతర్జాలం దుర్వినియోగం వంటి విషయాలపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అప్రమత్తంగా లేకపోతే కుటుంబాలు నాశనమవుతాయని హెచ్చరించారు.
కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# క్రీడలకు సమయం కేటాయిద్దాం!

- పేడాడ రామ్మోహన్



నవతరం-ఆమదాలవలస

ఆమదాలవలస మున్సిపాలిటీలోని పూజారి పేటకు చెందిన విక్రమ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ సీజన్ 3 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్ రావు గారు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ నిర్మాణం,క్రమశిక్షణ, జట్టు సమిష్టికృషి, శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం మరియు నాయకత్వం, సహకారం మరియు విజయం మరియు వైఫల్యాన్ని నిర్వహించడం వంటి కీలకమైన జీవిత నైపుణ్యాలను బోధించడంలో క్రీడల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం క్రీడాకారులతో ముచ్చటిస్తూ, ఆటలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని కనబరిచారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతిగా 15000 రూపాయలను రామ్మోహన్ గారు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఎల్లప్పుడూ యువతకు అండగా ఉంటూ సేవా కార్యక్రమాలకు సైతం సహకరిస్తున్న రామ్మోహన్ గారికి క్రీడాకారులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.




# డాక్టర్ సుధాకర్ కుటుంబానికి న్యాయం చేసిన కూటమి ప్రభుత్వం

- కరోనా సమయంలో దళిత వైద్యుడిపై వైసీపీ ప్రభుత్వ దారుణ వైఖరి
- నడిరోడ్డుపై హింసా మానసిక వేధింపులే మరణానికి కారణం
- 2024 ఎన్నికల్లో వైసీపీకి ప్రజల తీర్పు -- 11 స్థానాలకే పరిమితం
- డాక్టర్ సుధాకర్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం
- కుమారుడికి ఉద్యోగ పరంగా పదోన్నతి -- దళితులకు గౌరవ సూచిక
- కూటమి ప్రభుత్వానికి దళిత సమాజం అండగా నిలవాలి : తిరుమలరావు

(నవతరం, శ్రీకాకుళం)

కరోనా మహమ్మారి సమయంలో ముఖ కవచాల కొరతపై ప్రశ్నించిన కారణంగా, దళిత కులానికి చెందిన కీర్తిశేషులు డాక్టర్ సుధాకర్‌ను అప్పటి వైసీపీ ప్రభుత్వం అమానుషంగా వేధించిందని శ్రీకాకుళం జిల్లా ఎస్సీ--ఎస్టీ పర్యవేక్షణ కమిటీ సభ్యుడు, జిల్లా ఎంఎస్‌పీ అధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు దాసరి తిరుమలరావు మాదిగ విమర్శించారు.
డాక్టర్ సుధాకర్‌ను దళిత వైద్యుడన్న విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోకుండా, మానసిక స్థితి సరిగా లేదని ముద్ర వేసి నడిరోడ్డుపై కొట్టి, ఐటీఎస్ ఆసుపత్రికి తరలించి శారీరకంగా, మానసికంగా నానా హింసలకు గురిచేయడం చివరకు ఆయన మరణానికి కారణమైందన్నారు. ఈ ఘటనకు అప్పటి వైసీపీ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉందని తెలిపారు.
దళితులపై జరిగిన ఈ అన్యాయాలకు ప్రజలు ఇచ్చిన తీర్పే 2024 ఎన్నికల్లో వైసీపీని కేవలం 11 స్థానాలకే పరిమితం చేయడమని తిరుమలరావు వ్యాఖ్యానించారు. ఇది దళిత సమాజంపై జరిగిన అన్యాయాలకు ప్రజలు ఇచ్చిన శిక్షగా భావించాలన్నారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దళితుల పట్ల ఉన్న నిబద్ధతను చాటుకుంటూ డాక్టర్ సుధాకర్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం అందించడంతో పాటు, ఆయన కుమారుడికి ఉద్యోగరీత్యా పదోన్నతి కల్పించడాన్ని అభినందించారు. డాక్టర్ సుధాకర్ మన మధ్య లేకపోయినా, ఆయన కుటుంబానికి ఇచ్చిన గౌరవం యావత్తు దళిత సమాజానికి ఇచ్చిన గౌరవంతో సమానమన్నారు.
దళితులపై ప్రేమ, గౌరవం చూపే ప్రభుత్వానికి దళితులందరూ ఐక్యంగా అండగా నిలవాల్సిన అవసరం ఉందని, అలాంటి ప్రభుత్వాన్ని కలిసికట్టుగా బలపరచాలని తిరుమలరావు పిలుపునిచ్చారు.
ఈ నిర్ణయాలు తీసుకున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, కింజరాపు అచ్చం నాయుడు, కేంద్ర మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు, శ్రీకాకుళం శాసనసభ్యుడు గోండు శంకర్‌తో పాటు జిల్లా శాసనసభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.
తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి నాయకులతో పాటు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్, ఎంఎంఎఫ్, ఎంఎస్‌ఎఫ్, విహెచ్‌పీఎస్ తదితర అనుబంధ సంఘాల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తిరుమలరావు పేర్కొన్నారు.

# అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ

- లయన్ హారిక ప్రసాద్




(నవతరం, శ్రీకాకుళం)

అంధుల ఆరాధ్య దైవం లూయిస్ బ్రెయిలీ అని, హర్షవల్లి లైన్స్ క్లబ్ శ్రీకాకుళం వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ హారిక ప్రసాద్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నాడు నిర్వహించబడిన రాష్ట్రవ్యాప్త లూయిస్ బ్రెయిలీ 217వ జయంతి ఉత్సవాల సందర్భంగా హర్షవల్లి లయన్స్ క్లబ్ సమావేశానికి హాజరైన ప్రతినిధులకు అల్పాహారం అందించింది. ఈ సందర్భంగా లయన్ హారిక ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అంధత్వ నివారణకు కృషి జరుగుతున్న నేపథ్యంలోనే 217 ఏళ్ల క్రితం జన్మించిన లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం ప్రత్యేక లిపిని రూపొందించి, వారి జీవితాలలో వెలుగును నింపారన్నారు. అనంతరం లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి హర్షవల్లి లయన్స్ క్లబ్ సభ్య బృందం నివాళులు అర్పించి, వారి యొక్క సేవలను ప్రస్తుతించారు. అలాగే ప్రస్తుతం ప్రభుత్వపరంగా దివ్యాంగులకు అత్యధిక మొత్తంలో పింఛను అందుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ప్రభుత్వాన్ని కొనియాడారు. దివ్యాంగులకు కూడా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి వారి ఆర్థిక సాధికారిక చేయూతనిస్తే బాగుంటుందని, వారికి ఏటీఆర్ (అసెస్మెంట్ ట్రీట్మెంట్ రిహాబిలిటేషన్) సేవలను అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హర్షవల్లి లయన్స్ క్లబ్ గత ఏడాది 150 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించిందని, ఈ ఏడాది మార్చి నెలలో మరల దివ్యాంగుల కోసం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించనున్నట్లు, జిల్లావ్యాప్తంగా చిన్నారులందరికీ కూడా కంటి పరీక్షలు నిర్వహించి గ్లకోమా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి భవిష్యత్తులో అందత్వం లేకుండా నివారించేందుకు ప్రయత్నాలు కొనసాగాలని ఆకాంక్షంచారు..
ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు, హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు వావిలపల్లి జగన్నాథ నాయుడు, చందక నీహార్, మణిశర్మ, తర్లాడ అప్పల నాయుడు, డాక్టర్ హారిక, మజ్జి సుమన్, లక్ష్మణ్, లక్ష్మపతి, గణపతి, మాధవి, రాష్ట్రవ్యాప్తంగా హాజరైన సుమారు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**